# పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రత్యేక పరిశీలకులు అజయ్ వి నాయక్, దీపక్‌మిశ్రా

- రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల పరిశీలకుడు అజయ్ నాయక్
- రాష్ట్ర ప్రత్యేక పోలీస్ పరిశీలకులు దీపక్‌మిశ్రా
- ఎన్నికల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షాసమావేశం

కలెక్టరేట్, నవంబర్ 28: ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా, పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల పరిశీలకులు అజయ్ వి నాయక్, రాష్ట్ర ప్రత్యేక పోలీసు పరిశీలకులు దీపక్ మిశ్రా జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సిరిసిల్ల, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లపై అధికారులతో వారు మంగళవారం సమీక్షించారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్ అనురాగ్ జయంతి, భద్రతా ఏర్పాట్లను ఎస్పీ అఖిల్‌మహాజన్ పరిశీలకులకు వివరించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్, ఎన్నికల పోలీసు పరిశీలకులు వినీతా సాహూ, ఎన్నికల వ్యయ పరిశీలకులు మణిగండసామి, రిటర్నింగ్ అధికారులు ఆనంద్‌కుమార్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

**సైలెన్స్ పీరియడ్‌లో బల్క్ ఎస్ఎంఎస్‌లు నిషేధం**

ఈనెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్‌కు ముందు 48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో రాజకీయపరమైన ఎస్ఎంఎస్‌లు, బల్క్ ఎస్ఎంఎస్‌లను పంపరాదని జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. 28న సాయంత్రం 5 గంటల నుంచి 30న సాయంత్రం 5 గంటల వరకు సైలెన్స్ పీరియడ్ అమలులో ఉంటుందన్నారు. ఈ పీరియడ్‌లో రాజకీయపరమైన ఎస్ఎంఎస్‌లు, ప్రసారాలను ఎన్నికల కమిషన్ నిషేధించిందని పేర్కొన్నారు. అందులో భాగంగా జిల్లాలోని ఎన్నికల పోటీలో అభ్యర్థులు తమ ప్రచారంలో ఎన్నికల కమిషన్ సూచనలు, ఆదేశాలను ఉల్లంఘించేలా అభ్యంతరకర ఎస్ఎంఎస్, బల్క్ ఎస్ఎంఎస్‌లు పంపితే విచారణ జరిపి భారత శిక్షాస్మృతి (ఐపీసీ) ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, ఎన్నికల ప్రవర్తన నియమావళి 1961 ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్ఎంఎస్‌ల ఖర్చులను కూడా పరిగణలోకి తీసుకుంటారని తెలిపారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు ప్రింట్ మీడియాలో ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతులు తీసుకోవాలని తెలిపారు.

## ఓటరు కార్డు రాలేదా ..

- 12 గుర్తింపు కార్డుల్లో ఏది ఉన్నా ఓటు వేయచ్చు
- కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, నవంబర్ 28: ఈ నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా ప్రత్యామ్నాయంగా వివిధ గుర్తింపు కార్డులను చూపించి ఓటు వేసే అవకాశాన్ని భారత ఎన్నికల కమిషన్ కల్పించిందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఎన్నికల సిబ్బంది ఇంటింటా పంపిణీ చేసే ఫొటోతో కూడిన ఓటరు చీటీ కేవలం పోలింగ్ కేంద్రం, ఓటర్ల జాబితాలో క్రమ సంఖ్యతో కూడిన సమాచారం మాత్రమేనని చెప్పారు. ఓటు వేయడానికి వెళ్లే ముందు ఆ స్లిప్పుతోపాటు ఓటరు గుర్తింపు కార్డు లేదా ప్రభుత్వం జారీ చేసిన 12 గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి ఇక్కడ చూపించాలన్నారు. ఓటరు గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, ఎంఎన్ఆర్‌జీఏ జాబ్‌కార్డు, పోస్టాఫీసు లేదా బ్యాంకు జారీ చేసిన ఫొటోతో ఉన్న పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్‌కార్డు, ఇండియన్ పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పింఛన్ మంజూరు డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ కార్డు, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు జారీ చేసిన అధికార గుర్తింపు పత్రం, దివ్యాంగుల ఐడెంటిటీ కార్డుల్లో ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకొని పోలింగ్ కేంద్రంలో చూపించి ఓటు హక్కు వినియోగించుకోచ్చని పేర్కొన్నారు.

## మూడో ర్యాండమైజేషన్ పూర్తి

కలెక్టరేట్, నవంబర్ 28: శాసనసభ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలో గల 547 పోలింగ్ బూత్‌లలో పోలింగ్ రోజు విధులు నిర్వర్తించే సిబ్బంది మూడో విడుత ర్యాండమైజేషన్ పూర్తయింది. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఎన్నికల సాధారణ పరిశీలకులు జగదీశ్ సోన్‌కర్, పోలీసు పరిశీలకురాలు వినీతాసాహూ, కలెక్టర్ అనురాగ్ జయంతి ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ ఉన్నారు.

## ఎన్నికలకు ప్రతిష్ట భద్రతా ఏర్పాట్లు

ముస్తాబాద్, నవంబర్ 28: ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా నాయకులు, ప్రజలు సహకరించాలని ఎస్ఐ శేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలతో పాటు గ్రామాల్లో బీఎస్ఎఫ్ పోలీసులతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి



కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల వీడియో కాన్ఫరెన్స్

కలెక్టరేట్, నవంబర్ 28: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ అనురాగ్ జయంతి కేంద్ర ఎన్నికల అధికారులకు తెలిపారు. రాష్ట్ర శాసనసభకు జరుగబోయే సాధారణ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లపై కేంద్ర ఎన్నికల అధికారులు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ అఖిల్‌మహాజన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాటు, ఈవీఎంల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు కలెక్టర్, ఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు తెలిపారు. పటిష్ట భద్రతా చర్యలు తీసుకున్నామని ఎస్పీ అఖిల్‌మహాజన్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌కు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ రిటర్నింగ్ అధికారులు ఆనంద్‌కుమార్, మధుసూదన్, సంబంధిత అధికారులు ఉన్నారు.

# పసలేని కేకే మహేందర్ రోడ్ షో



కేకే మాట్లాడుతుండగా తిరిగి వెళ్లిపోతున్న జనం

- విమర్శలు పట్టించుకోని జనం
- సభ మధ్యలో వెనుదిరిగిన మహిళలు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 28: మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి చేపట్టిన రోడ్‌షో ఫ్లాప్‌షోగా మిగిలిపోయింది. మంత్రి కేటీఆర్ ఆదివారం చేపట్టిన రోడ్డు షోకు మండలంలోని 24 గ్రామాల నుంచి బ్రహ్మరథం పట్టిన తీరును చూసి బెంబేలెత్తిన కాంగ్రెస్ నాయకులు పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న చందాన కేకే మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు షో ఏర్పాటు చేసి జనాన్ని తరలించే ప్రయత్నం చేయగా అనుకున్న స్థాయిలో జనం రాలేదు. కేకే మాటలను ఎవరూ పట్టించుకోకపోవడం కొసమెరుపు. ప్రజలకు ఏం చేస్తారో స్పష్టత ఇవ్వకుండా వ్యక్తులపై విమర్శలకు పరిమితమైన తీరును చూసి విసుక్కున్న జనం కేకే మాట్లాడుతుండగానే మధ్యలోనే వెళ్లిపోయారు. కేటీఆర్ రోడ్డుషోతో కేకే రోడ్డుషోను పోల్చుకుని కేటీఆర్ గెలుపు ఖాయమైనట్లేనని జనం పేర్కొన్నారు.

## ఓటు హక్కు విలువైనది : ఎస్ఐ సుధాకర్



పోస్టల్ ఓటు హక్కు వినియోగించుకున్న ఎస్ఐ సుధాకర్, సిబ్బంది

ఇల్లంతకుంట, నవంబర్ 28 : ఓటు హక్కు చాలా విలువైనదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దానిని సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ దాస సుధాకర్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఎస్ఐ తన సిబ్బందితో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా ఒక్క ఓటుతో ఏమవుతుందని ఎప్పుడూ అనుకోకూడదన్నారు. అమూల్య మైన ఓటు ద్వారా మంచి నాయకులను ఎన్నుకునే హక్కు ఓటర్లకు ఉందని చెప్పారు. గ్రామాల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుళ్లు అనిల్, సునీల్, తిరుపతి తదితరులు ఉన్నారు.

## ఎన్నికలు ముగిసే వరకు 144 సెక్షన్

వేములవాడ, నవంబర్ 28: వేములవాడ నియోజకవర్గంలో నేటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎట్టి పరిస్థితిల్లోనూ ఎన్నికల ప్రచారం నిర్వహించవద్దన్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి ప్రచారాలకు వచ్చినవారు స్వస్థలాలకు వెళ్లిపోవాలి సూచించారు. గురువారం సాయంత్రం ఎన్నికలు ముగిసే వరకు నియోజకవర్గంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. ఎక్కడైనా ఎన్నికల నిబంధనను అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 28: వెంకటాపూర్‌కు చెందిన పలువురు బీజేపీ నాయకులను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. గతంలో బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పని చేసిన వెంకటాపూర్‌కు చెందిన పులి కృష్ణ, మేడిశెట్టి ప్రభాకర్ వ్యక్తిగత కారణాలతో బీజేపీలో చేరి తిరిగి మంగళవారం సొంతగూటిలో చేరారు. అలాగే యూత్ లీడర్లు జాగిరి మధు, సిరిసిల్ల విక్రమ్, దుంపలపల్లి రాజు, పెద్దోళ్ల ఎల్లం, దుగ్గు బాలకిషన్, జక్కు నర్సింలు, సాయిచందు, జాగిరి రాజును ఆగయ్య బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఇక్కడ మేడిశెట్టి శ్రీనివాస్, మేడిశెట్టి మల్లేశం ఉన్నారు.

## ఆలోచింపజేస్తున్న 'రండి ... ఓటేద్దాం' వీడియో

కలెక్టరేట్, నవంబర్ 28: ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఓటర్లు ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటేనే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని తెలుపుతూ 'రండి ఓటేద్దాం' అనే పేరుతో రూపొందించిన వీడియో సాంగ్ ప్రజలను ఆలోచింప చేస్తుంది. జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో డీపీఆర్‌వో మామిండ్ల దశరథం ఈ వీడియో సాంగ్ రూపొందించారు. సీడీలోని పాటలను గడ్డం శ్రీనివాస్ రచించి స్వరకల్పన చేయగా, గడ్డం దిలీప్ వీడియో ఎడిటింగ్ చేశారు. కాయితోజు ప్రవీణ్ సంగీతం సమకూర్చగా డీపీఆర్‌వో మామిండ్ల దశరథం పాడారు.

## ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం

రుద్రంగి, నవంబర్ 28: మండల కేంద్రంలోని ప్రహ్లాద పర్వతంపై వెలిసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామివారి రథోత్సవం శోభాయమానంగా జరిగింది. శ్రీలక్ష్మీ నరసింహస్వామి రథానికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు. అంబేద్కర్ చౌరస్తా, హనుమాన్ ఆలయం, ఇందిరాచౌక్ మీదుగా తిరిగి స్వామి వారి రథం కోవెలకు చేరింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొమురె శంకర్, నాయకులు అంబటి గంగాధర్, దాసరి గంగారాజం, ఆకుల వెంకటి, ఇప్ప మల్లేశం, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో బద్దిపోచమ్మ బోనాలు

వేములవాడ టౌన్, నవంబర్ 28 : వేములవాడ రాజన్న అనుబంధ శ్రీ బద్దిపోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తులు బోనాలు సమర్పించారు. రాజన్నను దర్శించుకున్న అనంతరం బద్దిపోచమ్మకు మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. ఆలయంలో భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో ఆలయ పర్యవేక్షకులు హరిహరనాథ్ ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ, వెంకటేశ్, శివరాజ్ తదితరులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.